# కొత్తకోణం

-నందిరాజు పద్మలతాజయరాం



"అమ్మా నీతో కొంచెం మాట్లాడాలి" తీరిగ్గా కూర్చుని పూలు అల్లుకుంటున్న శాంత దగ్గరికి వచ్చాడు కొడుకు రాజీవ్.

"అయితే అప్పాయింట్‌మెంట్ తీసుకోరా! నేను బిజీ ఇప్పుడు" నవ్వుతూ అంది శాంత.

"నవ్వులాటకాదమ్మా! నిజంగానే చాలా సీరియస్ విషయం"

"ఎవరికి సీరియస్? నీకా, నాకా, నాన్నగారికా?"

"అబ్బా! జోక్స్ వద్దు" గంభీరంగా అన్నాడు రాజీవ్.

"సరే చెప్పు" చేతిలోని మాలని ఒళ్ళో పెట్టేసి బుద్ధిగా కొడుకు వైపునకు తిరిగింది శాంత.

"అమ్మా! నేనూ! నేనూ..."

"సణుగుడు ఆపి విషయానికి రారా!" చ...అదేనమ్మా! ఎలా చెప్పాలా అని ఊఁ..నేను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానమ్మా. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుందామని అనుకుంటున్నాను" చల్లగా చెప్పాడు రాజీవ్.

"నేను అనుకుంటూనే ఉన్నాను. ఆ అమ్మాయి పేరేంటి? కృత్తిక కదూ!" అడిగింది శాంత.

"నీకెలా తెలుసమ్మా?" ఆశ్చర్యపోయాడు రాజీవ్.

"తెలుసులేవోయ్. నీకోసం ఫోన్‌చేసి నాతో కబుర్లు చెప్పేటప్పుడే కాస్త అనుమానం వచ్చింది. ఆంటీ...ఆంటీ అంటూ మన ఇంట్లో విషయాలు అడగడం...ఇవన్నీ ప్రేమజ్వరం వచ్చాక కలిగే పైత్యాలే. ఇంతకీ ఏమంటావు?"

"ఎలాగైనా నాన్నతో చెప్పి ఒప్పించాలి. మన వాళ్ల అమ్మాయి కాదుగానీ ఎంత మంచిదో! ముఖ్యంగా నువ్వంటే ఎంత గౌరవమూ, అభిమానమో. ప్లీజ్... హెల్ప్ మీ" తల్లిచేతులు పట్టుకున్నాడు.

ఓ నిముషం ఆలోచించింది శాంత. ఆ తర్వాత "సరే" అంది. అమాంతం తల్లిని ఎత్తేసి గిరగిరా తిప్పాడు రాజీవ్ ఆనందంగా.

రాత్రికి భర్త కోసల్‌రాంకి చెప్పింది శాంత.

"వాళ్ళెవరో, ఏంటో తెలీకుండా ఆ కుటుంబ సంప్రదాయం, నేపథ్యం తెలుసుకోకుండా కుటుంబంలోకి తెచ్చుకుంటే ఏ ఇబ్బందులొస్తాయో! అయినా వీడు ఇంత పెద్దవాడెప్పుడయ్యాడబ్బా!" అనుమానించాడు కోసల్‌రాం.

ఎలాగో భర్తని ఒప్పించింది శాంత.

* * *

ఇంటి కోడలిగా అడుగుపెట్టింది కృత్తిక. కాపురానికి వచ్చిన నెలరోజులకి కోసల్‌రాంకి కోడలి వంట రుచి చూడాలని బుద్ధిపుట్టింది.

"అమ్మాయ్! మీ అత్తగారు ముప్పైఏళ్ళనుండీ ఒకటే రకం వంటలు చేసి పెడుతోంది. తిని తిని బోర్ కొట్టేస్తోంది. ఏదీ నీ మోడ్రన్ వంటలు చేసి పెట్టకూడదూ! వంటొచ్చా?" అన్నారు కోసల్‌రాం.

"వచ్చు మావయ్యా! పాలక్ పన్నీర్ బాగా చేయగలను. రేపు ఆదివారం కదా ఫ్రైడ్‌రైస్ చేసుకుందాం" సంతోషంగా ఒప్పుకుంది కృత్తిక.

తెల్లవారగానే వంట మొదలెట్టింది కృత్తిక. అత్తగార్ని హాయిగా టీవీ చూస్తూ హాల్లో కూర్చోమంది. చకచకా వంట పూర్తిచేసి అందర్నీ భోజనానికి పిలిచింది.

నిజంగానే కృత్తిక వంట చాలా బావుంది. శాంత కూడా మెచ్చుకుంది. ఇక కోసల్‌రాంకైతే ఆనందమే ఆనందం.

"ఇక నువ్వు రిటైరైపోయి కృత్తికకి ఛార్జ్ ఇచ్చెయ్యవోయ్ శాంతా!" అన్నాడు.

కానీ రాజీవ్‌కి మాత్రం భార్య వంట బొత్తిగా నచ్చలేదు.

"ఛ! ఇదేం వంట? ఛండాలంగా ఉంది. అసలు రుచే లేదు. అమ్మ వంట ఎంత బావుంటుంది? నాకు అసలు సయించడం లేదు" అని లేచెళ్ళిపోయాడు.

కృత్తిక కళ్లనీళ్ళు పెట్టుకుని గదిలోకి వెళ్లిపోయింది. శాంత మళ్లీ వంట చేసి కొడుక్కి వడ్డించింది. కోడల్ని అలా అనకూడదని కొడుక్కి నచ్చజెప్పింది. భోంచేసి ఇంటిచుట్టూ వాకింగ్ చేస్తున్న కోసల్‌రాం కొడుకు గదిలోంచి మాటలు వినపడుతూంటే వద్దనుకుంటూనే చెవులు సారించాడు.

"ఛ! ఏడవకు! ప్లీజ్! అసలు విషయం విను" రాజీవ్ బ్రతిమిలాడుతున్నాడు.

"ఏం వినాలి? నా వంట ఛండాలం. నేనూ ఛండాలం.. అంతే!" భోరుమంటోంది కృత్తిక.

"అదికాదు డియర్! విషయం విను. నీ వంట చాలా బాగుంది. అదే ప్రమాదకరమైన విషయం"

"అదెలా?"

"అంతేమరి! మా నాన్న భోజనప్రియుడు. మా అమ్మేమో అందరాడవాళ్లల్లా కాదు. అసలు అసూయ అనేదేలేదు. మా నాన్న వంటగది నీకిచ్చేయమంటే తక్కున అప్పగించి బైటికి వచ్చేస్తుంది. ఇక ఆ తర్వాత రోజూ వంట డ్యూటీ నీ మీదే పడుతుంది. ఇక మన సరదాలకు టైమెక్కడుంటుంది?"

"కానీయండి. మీ అమ్మగారు ముప్పై ఏళ్ల నుండీ చేయడం లేదా! ఆవిడకి కాస్త విశ్రాంతినిస్తే తప్పేముంది? చిన్నప్పుడే కాపురానికి వచ్చి అత్త మామలకి, మరుదులకి, ఆడబిడ్డలకి, ఆ తర్వాత మీకూ అందరికీ ఆవిడ సేవలు చేశారని మీరే గదా చెప్పారు" అమాయకంగా అడిగింది కృత్తిక.

"పిచ్చి కృత్తికా! అనవసరమైనవి నెత్తిన వేసుకుని బాధ్యతలు పెంచుకోకు. ఫ్రీగా గడపాల్సిన లైఫ్‌ని బాధ్యతలతో ముంచెయ్యకు. అమ్మని కాస్త పొగిడితే చాలు ఇట్టే పడిపోతుంది. ఓకేనా!" రాజీవ్ నవ్వుతో కృత్తిక నవ్వు కూడా శృతి కలిపింది.

కొడుకులోని కొత్త కోణాన్ని చూసిన కోసల్‌రాం తను విన్న విషయం భార్యతో ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు. ఆయన ఏం చెప్పినా ఆ అమ్మ నమ్మదని, కన్నబిడ్డ మీద మమకారం కరిగిపోదని పాపం కోసల్‌రాంకి తెలీదు.

★